# అభివృద్ధే తారక మంత్రం

## గ్రేటర్‌లో ప్రతిపక్షాలకు కరువైన ఎన్నికల ఎజెండా

- తొమ్మిదేండ్లలో నాల్గింతల అభివృద్ధి చేసిన తెలంగాణ ప్రభుత్వం
- 2004 నుంచి 14 వరకు కాంగ్రెస్ హయాంలో నగరాభివృద్ధి వ్యయం రూ.22వేల కోట్లు
- 2014 -23లో ఏకంగా రూ.88వేల కోట్లు ఖర్చు చేసిన తెలంగాణ సర్కారు
- కేవలం 8.2 శాతం నిధులిచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం

హైదరాబాద్ విశ్వనగరం... ఇప్పుడు అంతర్జాతీయంగా పెట్టుబడులకు స్వర్గధామం. ఐటీ, లైఫ్ సైన్సెస్‌లోనే కాదు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఇతర మెట్రో నగరాల కంటే మెరుగైన స్థానంలో దూసుకెళ్లడమంటే తొమ్మిదేండ్ల తెలంగాణ సర్కారు కృషి ఉంది. ఇది మన నగరం అనే అంకితభావంతో సీఎం కేసీఆర్, విశ్వనగరంగా మార్చి చూపాలనే మంత్రి కేటీఆర్ పట్టుదలతోనే ఈ మహా నగరానికి ఇప్పుడు సెలబ్రిటీలు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల ప్రశంసలు దక్కుతున్నాయి. మరి... ఎన్నికలొచ్చాయ్! హైదరాబాద్ మహా నగరానికి గతంలో మేం ఇది చేశాం, అది చేశాం అని కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటే! కేంద్రంలోని బీజేపీ సర్కారు నగరాభివృద్ధికి ఎంతో సహకరించిందంటూ బీజేపీ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ..ఒక్కసారి హైదరాబాద్ ప్రస్థానాన్ని పరిశీలిస్తే పదేండ్లు పాలించిన కాంగ్రెస్ సర్కారు ఎంత ఖర్చు చేసింది? ఈ తొమ్మిదేండ్లు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్ని నిధులిచ్చింది? నగర ముఖ చిత్రం మారేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధిని ప్రదర్శించిందో అర్థమవుతుంది. అందుకే ఒక్కసారి ఆ నిధుల లెక్కేమిటో తెలిస్తే... గత కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి తెలంగాణ సర్కారు నగరాభివృద్ధికి వెచ్చించిన నిధుల తీరులో నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా! ఇక... నగరంలో పేర్చిన ప్రతి ఇటుకలోనూ మా వాటా ఉందంటూ నిత్యం మీడియా ముందు ప్రకటనలు చేసే కేంద్రంలోని బీజేపీ చిత్తశుద్ధి ఈ రికార్డుల్లో నల్లపూసే!!

*- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ)*

**అభివృద్ధిలో కీలకమైనవి...**

| | |
|---|---|
| వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) 42 ప్రాజెక్టులు | 6,763.88 |
| సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం (సీఆర్ఎంపీ) 809 కిలోమీటర్లు | 1,027 |
| మిస్సింగ్ లింకు రోడ్ల ప్రాజెక్టు 191 కిలోమీటర్లు | 2,215 |

ఒకనాడు రెండు ఫ్లైఓవర్లు, ఒక టవర్ నిర్మిస్తేనే హైదరాబాద్ ప్రపంచ పటంలోకి ఎక్కిందంటూ డబ్బాలు కొట్టుకునే వాళ్లు. కానీ గడిచిన తొమ్మిదేండ్లలో నిర్మించిన ఫ్లైఓవర్లు, ఆర్‌యూబీలు, ఆర్వోబీల చిట్టా చాంతాడంత. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన మంచినీరు, మురుగునీటి పారుదలకు చేపట్టిన పనులైతే రానున్న వందేళ్లు పెరిగే జనాభా అవసరాలను సైతం తీర్చేలా ఉన్నాయి. ముఖ్యంగా భావి హైదరాబాద్‌కు సైతం ఈ తొమ్మిదేండ్లలో చేసిన దానికంటే మించి ప్రణాళికలు ఇప్పటికే అమలులోకి కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం గడిచిన తొమ్మిదేండ్లలో హైదరాబాద్ మహా నగరంలో మౌలిక సదుపాయాలకు వెచ్చించిన నిధుల మొత్తం ఏకంగా రూ.88వేల కోట్ల పైమాటే. అంటే ఏడాదికి రూ.పదివేల కోట్లు!! దేశంలోని ఏ మెట్రో నగరంలోనూ ఈ స్థాయి అభివృద్ధి జరగలేదనేది జగమెరిగిన సత్యం.



ఎల్బీనగర్ చౌరస్తాలో నిర్మించిన ఫ్లైఓవర్లు, ఆర్‌యూబీ

**రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్ మహా నగరం, పట్టణాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం వెచ్చించిన నిధులు రూ.1,11,360.02 కోట్లు**

**ఇందులో అమృత్, హృదయ్, స్వచ్ఛ భారత్, 14-15 ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్రం ఇచ్చినవి - రూ.9,934 కోట్లు**

**అంటే కేవలం 8.2 శాతం మాత్రమే. ఇందులోనూ హైదరాబాద్ నగరాభివృద్ధికి సంబంధించిన నిధులు రూ.500 కోట్లు ఉంటే అదే మహా ఎక్కువ.**

### నాలుగు రెట్లు అదనంగా...

హైదరాబాద్ అభివృద్ధి ప్రస్థానంలో 2004 నుంచి 2023 వరకు అంటే 19 సంవత్సరాల పాటు ఆయా ప్రభుత్వాలు ఖర్చు చేసిన మొత్తం సుమారు రూ.1,10,420.99 కోట్లు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఖర్చు చేసిన నిధులు కేవలం 20.33 శాతం. అదే తెలంగాణ ప్రభుత్వం వెచ్చించిన మొత్తం ఏకంగా 79.66 శాతం. అంటే... పదేండ్లలో ఖర్చు చేసిన దానికంటే నాలుగు రెట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వెచ్చించి మౌలిక వసతులు కల్పించింది. అందుకే ఒకప్పటి హైదరాబాద్.. ఇప్పటి హైదరాబాద్‌ను చూసి తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, శ్రీలంక స్పిన్ బౌలర్ ముత్తయ్య మురళీధరన్, సినీ నటి లయ, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు...కొనియాడుతున్నారు.

### బీఆర్ఎస్‌ది అభివృద్ధి.. ప్రతిపక్షాల్లో కనిపించని చిత్తశుద్ధి...

రాజకీయంగా తెలంగాణలో హైదరాబాద్ మహా నగరం అనేది అత్యంత కీలకమైనది. 32 నియోజకవర్గాల హెచ్ఎండీఏ పరిధి అనేది రాష్ట్ర రాజకీయాల్ని శాసిస్తాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్తున్నది. ఇప్పటికే ఖరారైన బీఆర్ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాల వారీగా చేసిన అభివృద్ధిని అక్షరరూపంలో ప్రజల ముందు ఉంచుతున్నారు. నిన్నటిదాకా నగరం ఎలా ఉంది? ఇప్పుడెలా రూపురేఖల్ని మార్చుకొని ప్రపంచస్థాయి నగరంగా ఎదిగిందనే వివరాలు, కండ్ల ముందు కనిపిస్తున్న నిర్మాణాలను ప్రజలకు వివరిస్తున్నారు. ముఖ్యంగా నగరాభివృద్ధిలో మంత్రి కేటీఆర్ మార్కు అనేది సామాన్యుడు మొదలు అంతర్జాతీయ స్థాయి కంపెనీల సీఈవోల వరకు అనుభవంలో ఉన్నదే. ఇదే తరుణంలో ప్రతిపక్ష పార్టీలకు మాత్రం మహా నగరంపై ఎజెండానే కరువైంది. గత తొమ్మిదేండ్లలో దిమ్మతిరిగే రీతిలో నగరం అభివృద్ధి చెందిన దరిమిలా కాంగ్రెస్, బీజేపీలకు చెప్పుకునేందుకు ఏమీ లేకుండా పోయింది. ఒక వైపు కాంగ్రెస్ తాను అధికారంలో ఉన్న 2004-14లోనే ఎంతో కొంత అభివృద్ధి జరిగిందని చెప్పుకునే ప్రయత్నం చేసినా... తొమ్మిదేండ్ల అభివృద్ధి ముందు అది దిగదుడుపుగా మారింది. దీంతో నగర కాంగ్రెస్ మాత్రమే కాదు... టీపీసీసీ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధిపై నోరుమెదపలేని దుస్థితి. మరోవైపు బీజేపీ నాయకులది మరో విచిత్రమైన పరిస్థితి. అభివృద్ధిలో మా వాటా ఉందంటూ ఊక దంపుడు ఉపన్యాసాలే తప్ప... వాస్తవంగా లెక్కల్లోకి వెళితే తొమ్మిదేండ్లలో రాష్ట్రవ్యాప్తంగా నగరం, పట్టణాల అభివృద్ధికి వచ్చిన మొత్తం కేవలం రూ.9,934 కోట్లు మాత్రమే. ఇవి కూడా అమృత్, హృదయ్, 14,15 ఆర్థిక సంఘంతో పాటు స్వచ్ఛ భారత్ కింద వచ్చినవే. అంటే ఇందులో పట్టుమని పది శాతం కూడా హైదరాబాద్ నగరాభివృద్ధిలో లేవు. దీంతో వారికి కూడా హైదరాబాద్ మహా నగరంలో చెప్పుకునేందుకు కూడా ఏమీలేదు. అందుకే ఈ రెండు పార్టీలకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అభ్యర్థులే కరవయ్యారు.

**పదేండ్లలో కాంగ్రెస్ సర్కారు, గత తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి వెచ్చించిన నిధుల తీరు...**

| విభాగం | 2004-14 కాంగ్రెస్ హయాం | 2014-2023 బీఆర్ఎస్ హయాం |
|---|---|---|
| గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) | 4,636.38 | 44,021.99 |
| జలమండలి | 6,403.00 | 18,581.00 |
| హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) | 2,607.36 | 4,388.28 |
| హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) | 3,187.14 | 2,945.50 |
| హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) | 5,616.00 | 18,034.00 |
| మొత్తం | 22,449.88 | 87,970.77 |

**ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన.. వస్తున్న తీరు ఇలా...**

- **2018-19 - రూ.286.50 కోట్లు** — ఫ్లైఓవర్లు - 3, అండర్‌పాస్‌లు - 3, ఆర్‌యూబీ - 1 (7 ప్రాజెక్టులు)
- **2019-20 - రూ.176.60 కోట్లు** — ఫ్లైఓవర్లు - 2, ఆర్‌యూబీ - 1 (3 ప్రాజెక్టులు)
- **2020-21 - 539.70 కోట్లు** — ఫ్లైఓవర్లు - 5, ఆర్‌యూబీ - 1, కేబుల్ బ్రిడ్జి - 1, అండర్‌పాస్ - 1, ఆర్వోబీ-1, బాటిల్‌నెక్ విస్తరణ - 1 (10 ప్రాజెక్టులు)
- **2021-22 - 993.53 కోట్లు** — ఫ్లైఓవర్లు - 4, బ్రిడ్జి - 1, అండర్‌పాస్‌లు - 1, ఆర్‌యూబీ - 1 (7 ప్రాజెక్టులు)
- **2022-23 - రూ.1,252.08 కోట్లు** — ఫ్లైఓవర్లు - 5, ఆర్వోబీ - 1, గ్రేడ్ సపరేటర్ - 1 (7 ప్రాజెక్టులు)
- **2023-24 - రూ.3,512.08** — ఫ్లైఓవర్లు - 9, గ్రేడ్ సపరేటర్లు - 2, ఆర్వోబీ - 2 (13 ప్రాజెక్టులు)

# కాంగ్రెస్, బీజేపీలో.. ప్యారాచూట్ నేతల కలకలం

**ఇబ్రహీంపట్నంలో బూర సమావేశానికి స్థానిక నేతల డుమ్మా**
**స్థానికేతరుడికి టికెట్ ఎలా ఇస్తారంటూ ప్రశ్నిస్తున్న నాయకులు**

**కాంగ్రెస్‌లో టికెట్ నాదేనంటూ మరో నేత రాంరెడ్డి తిరుగుబావుటా ❖ మల్‌రెడ్డి సమావేశం నిర్వహించిన ఫంక్షన్ హాల్లోనే రాంరెడ్డి కూడా..**

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం: ఏండ్ల తరబడి పార్టీని నమ్ముకున్న స్థానిక నేతలను కాదని.. ప్యారాచూట్ నేతలను అందలం ఎక్కించడం పై కాంగ్రెస్‌లోనే కాదు... బీజేపీలోనూ నేతలు భగ్గుమంటున్నారు. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీజేపీలోనూ ఇదే కలకలం మొదలైంది. రెండు రోజుల కిందట ఆ పార్టీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ నియోజకవర్గంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనిపై ముందస్తుగానే అందరికీ సమాచారం ఇచ్చినప్పటికీ కీలక నేతలెవరూ హాజరు కాకపోవడం గమనార్హం. వాస్తవానికి ఆ పార్టీ నుంచి పలువురు స్థానిక నేతలు టికెట్ ఆశిస్తున్నారు. ఈ మేరకు దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న బూర నర్సయ్యగౌడ్ పరోక్షంగా సంకేతాలు పంపేందుకు రెండు రోజుల కింద ఇబ్రహీంపట్నంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి, అందరినీ ఆహ్వానించారు. పలువురు నేతలు, కార్యకర్తలు సమావేశానికి వచ్చినప్పటికీ కీలకమైన నేతలు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అశోక్‌గౌడ్, అర్జున్‌రెడ్డి, బాషా, దయానంద్‌గౌడ్ తదితర ముఖ్య నాయకులు ఈ సమావేశానికి దూరంగా నిలవడంతో పాటు టికెట్ కేటాయింపుపై గళం విప్పుతున్నారు. ప్యారాచూట్ నేతకు టికెట్ ఎలా ఇస్తారంటూ వీరిలోని పలువురు నాయకులు ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో ఇప్పటిదాకా కాంగ్రెస్ శ్రేణులనే వెంటాడిన ఈ బెడద ఇప్పుడు కమలంలోనూ మొదలైందని జనం చర్చించుకుంటున్నారు.

**అదే ఫంక్షన్ హాల్‌లో...**

మరో వైపు ఇబ్రహీంపట్నం కాంగ్రెస్‌లో అంతర్గత పోరు మరింత పెరుగుతోంది. ఇప్పటికే రేవంత్ వర్సెస్ కోమటిరెడ్డిగా నడుస్తున్న ఈ టికెట్ వ్యవహారం ఇప్పుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కూడా అంటుకుంది. తనకు సన్నిహితుడైన దండెం రాంరెడ్డి కోసం ఉత్తమ్ ప్రయత్నాలు చేస్తున్నారంటూ నియోజకవర్గంలో మరో చర్చ మొదలైంది. దీంతో రాంరెడ్డి తాజాగా శుక్రవారం తన వర్గం నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో మల్‌రెడ్డి రంగారెడ్డి సమావేశం నిర్వహించిన పెద్ద అంబర్‌పేటలోని తార కన్వెన్షన్ హాల్‌లోనే రాంరెడ్డి సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో రాంరెడ్డి వర్గం నేతలు టికెట్ తమ నేతకే ఖరారు చేశారంటూ బహిరంగంగానే ప్రకటనలు చేశారు. ఒకడుగు ముందుకేసి రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలంటూ సమావేశంలో ప్రసంగించడంతో ఇబ్రహీంపట్నం కాంగ్రెస్‌లో టికెట్ల పోరు తారాస్థాయికి చేరుకున్నట్లుగా తెలుస్తున్నది.

# మహేశ్వరాన్ని మరో హైటెక్ సిటీ చేస్తా



జిల్లెలగూడ సామయాదిరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

- విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి
- సబితమ్మను మళ్లీ గెలిపించుకుంటాం
- కాలనీ అసోసియేషన్ అధ్యక్షుల తీర్మానం
- సీఎం సహకారంతో కోట్ల రూపాయలతో అభివృద్ధి

బడంగ్‌పేట, అక్టోబర్13 : మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మహేశ్వరం నియోజకవర్గాన్ని మరో హైటెక్ సిటీగా అభివృద్ధి చేస్తానని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ సామయాదిరెడ్డి గార్డెన్‌లో వివిధ కాలనీల అసోసియేషన్ అధ్యక్షులతో శుక్రవారం మంత్రి సమావేశం నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ నాయకులు తమ అభిప్రాయాలను తెలిపారు. కాలనీల అభివృద్ధి కోసం 24 గంటలు కష్ట పడుతున్న సబితమ్మకు పూర్తిగా అండగా ఉంటామని కాలనీ వాసులు శపథం చేశారు. కాలనీలు అభివృద్ధి కావాలంటే సబితమ్మ మళ్లీ గెలవాలని కాలనీ వాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సంపూర్ణ సహకారంతో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. విద్యారంగానికి రూ.280 కోట్లు ఖర్చు చేశామని, రెండు డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు కోట్లతో ఏర్పాటు చేసిన జిల్లా గ్రంథాలయం ఎంతో మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు చదువు కోవడానికి వేదిక అయిందన్నారు. రూ.32 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. కందుకూరులో బీసీ సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ కళాశాల, మీర్‌పేటలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.40 కోట్లతో చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.1200 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయబోతున్నామని, కందుకూరులో రూ.176 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని వివరించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి కందుకూరు వరకు రూ.6600 కోట్లతో మెట్రో రైలు రాబోతుందన్నారు. నియోజకవర్గంలో 491 పరిశ్రమలు వచ్చాయని, వీటితో 42 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని ప్రతి గడపకు చేరాయన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కౌసిక్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కామేశ్ రెడ్డి, దిండు భూపేశ్ గౌడ్, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య బీరప్ప, రాంచందర్, సిద్దాల బీరప్ప, నవీన్ గౌడ్,బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కాలనీవాసులు



శామీర్‌పేటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

# ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది

- ముఖ్య కార్యకర్తల సమావేశంలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- కార్యకర్తలు కంకణ బద్ధులై పని చేయాలి
- కాంగ్రెస్ అంటేనే మోసం, స్కాం..

శామీర్‌పేట, అక్టోబర్ 13: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకే ఓటు అడిగే హక్కు ఉందని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సభ సందర్భంగా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని సీఎంఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట మండలం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కార్యకర్తలు కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశం గర్వించే స్థాయిలో పథకాలను ప్రజలకు అందిస్తున్నదన్నారు. దళితులను ధనవంతులుగా మార్చేందుకు దళితబంధు పథకాన్ని తీసుకువచ్చి దశల వారీగా అందజేస్తున్నామని తెలిపారు. గొల్లకురుమలకు గొర్రెలు, మత్స్యకారులకు చేప పిల్లలు, బీసీలకు బీసీబంధుతో ఆత్మబంధువుగా నిలుస్తున్నాడని కొనియాడారు. మారుమూల ప్రాంతమైన మూడుచింతలపల్లిని మండలంగా ఏర్పాటు చేసి అభివృద్ధికి రూ.69 కోట్లు కేటాయించిన మహానుభావుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండి.జహంగీర్, నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు సుదర్శన్, మల్లేశ్‌గౌడ్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఎంపీపీలు ఎల్లూబాయిబాబు, హారికామురళిగౌడ్, జడ్పీటీసీ అనితలాలయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్యాయాదవ్, వైస్ ఎంపీపీ సుజాత తిరుపతిరెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు జహీరుద్దీన్, ప్రధాన కార్యదర్శులు సతీష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి ప్రభాకర్, మాజీ ఎంపీపీలు సీతారాములుగౌడ్, యాదగిరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అంటేనే మోసం, స్కాం..

కాంగ్రెస్ అంటేనే మోసం, స్కాం అనే విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలని మంత్రి మల్లారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదని... దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల సమస్యను ఏనాడు పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాంతం 30 ఏండ్ల నుంచి ఏవిధంగా ఉండే.. బీఆర్ఎస్ హయాంలో ఏ విధంగా ఉంది అనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కన్నీటి కష్టాలకు స్వస్తి చెప్పి ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది కేసీఆర్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ హయాంలో నీళ్లు, కరెంటు ఉండేవి కావని... కనీసం రైతులు పండించిన పంటకు మద్దతు ధర లేదన్నారు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్న పీసీసీ కాంగ్రెస్ పార్టీ ఎంపీగా ఈ స్థానం నుంచి గెలిచి ప్రజల్లోకి ఒక్కరోజైనా వచ్చాడా? అని ప్రశ్నించారు. ఇలాంటి పార్టీలు, నేతలను నమ్ముకుంటే ప్రజలకు ఏమీ చేయరని జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు